సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం ¦ 22 ¦ డిసెంబర్ ¦ 2023



ఉత్సాహంగా ఉత్సవాలు..

జిల్లా స్థాయి యువజనోత్సవాలు కొత్తగూడెం క్లబ్‌లో గురువారం ఉత్సాహంగా సాగాయి. విద్యార్థులు పలు అంశాల్లో ప్రతిభ చాటారు.

8లో



బోధనలో నిర్లక్ష్యం చేయొద్దు

బోధనలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని డీఈఓ అన్నారు. మణుగూరు మండలంలోని పలు పాఠశాలలను ఆయన పరిశీలించారు.

8లో

గరిష్టం / కనిష్టం
28° / 17°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతాయి. తెల్లవారుజామున, రాత్రి వేళల్లో చలి ప్రభావం అధికంగా ఉంటుంది.

సాక్షి ఫోన్ ఇన్

కరోనా కొత్త వేరియంట్ - జాగ్రత్తలపై



కొత్తగూడెంరూరల్: కరోనా కొత్త వేరియంట్‌తో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైద్య సలహాల కోసం సాక్షి ఆధ్వర్యంలో శుక్రవారం ఫోన్ ఇన్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ బోడ కుమారస్వామి ప్రజల సందేహాలకు సమాధానాలు ఇస్తారు.

ఫోన్ చేయాల్సిన సమయం
శుక్రవారం ఉదయం 11 నుంచి
మధ్యాహ్నం 12.30 గంటల వరకు
సెల్ నంబర్లు : **9392336210**
7032022883

న్యూస్‌రీల్

ఆర్టీసీ స్థల వివాదంపై విచారణ

దమ్మపేట: దమ్మపేట మండలం మందలపల్లి బస్‌స్టేషన్ స్థల ప్రాంగణం సరిహద్దులపై వివాదం నెలకొనగా ఆర్టీసీ అధికారులు గురువారం పరిశీలించారు. కొద్ది రోజుల క్రితం మందలపల్లి బస్‌స్టేషన్ ప్రహరీ నిర్మాణానికి శ్రీకారం చుట్టగా స్థల దాత కుటుంబీకులు సరిహద్దులపై అభ్యంతరం తెలిపారు. దీంతో తహసీల్దార్ ముజాహిద్‌తో కలిసి ఆర్టీసీ అధికారులు పరిశీలించగా, త్వరలోనే హద్దులు నిర్ణయిస్తామని తెలిపారు. సత్తుపల్లి డీఎం రాజ్యలక్ష్మి, ఖమ్మం ఆర్టీసీ డీఈ అంజయ్య, ఏఈ రహీం, స్థలదాత అలపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

కొత్తగూడెంరూరల్: రాష్ట్రంలో కోవిడ్ కేసులు పెరుగుతున్నాయని, ప్రజలు కరోనా బారిన పడకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష తెలిపారు. గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజలంతా తప్పనిసరిగా మాస్కులు ధరించాలని, చేతులు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వ్యాధి బారిన పడిన వారు, దగ్గర ఉన్నవారు శానిటైజర్లు ఉపయోగించాలన్నారు. జర్వం, దగ్గు ఉంటే సమీప ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరీక్షలు చేయించుకోవాలని, భౌతిక దూరం పాటించాలని కోరారు.

నిలిచిన విద్యుదుత్పత్తి

పాల్వంచ : కేటీపీఎస్‌లో సాంకేతిక సమస్యతో గురువారం విద్యుదుత్పత్తి నిలిచింది. 5వ దశలోని పదో యూనిట్‌లో బాయిలర్ ట్యూబ్ లీకేజీ ఏర్పడడంతో 250 మెగావాట్ల ఉత్పత్తి నిలిపేశారు. సీఈ ఎం.ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో మరమ్మతులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉత్పత్తిని పునరుద్ధరించే అవకాశం ఉంది.

రేపు సింగరేణి ఆవిర్భావ దినోత్సవం

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ, లక్షలాది కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తున్న సింగరేణి సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నారు. కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో ప్రధాన వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జీఎం కట్టా బసవయ్య తెలిపారు. కొత్తగూడెంలోని కార్యాలయంలోని గురువారం ఆయన కార్యక్రమాల పోస్టర్లు విడుదల చేసి మాట్లాడారు. అధికారులు దీక్షితులు, కవితానాయుడు, సుశీల్, శ్రీనివాసరావు, కిరణ్‌కుమార్, కె.వరప్రసాద్‌రావు, పాసినెట్ పాల్గొన్నారు.

నేడే జలవిహారం

ఉదయం శాస్త్రోక్తంగా ప్లవోత్సవం

- సాయంత్రం స్వామివారికి తెప్పోత్సవం
- భద్రాచలానికి భారీగా రానున్న భక్తులు
- గోదారి తీరం వెంట సౌకర్యాలు పెంచాలనే డిమాండ్
- మొబైల్ యాప్ కావాలంటున్న భక్తులు

భద్రాచలం: ధనుర్మాసంలో పరుచుకునే మంచు తెరలు.. ఆ మంచు తెరలను చీల్చుకుంటూ పరుచుకునే దశమి నాటి వెన్నెల వెలుగుల మధ్య గలగలా పారే గోదావరిలో హంసవాహనంపై సీతాసమేత శ్రీరామచంద్రమూర్తి విహరించనున్నారు. భద్రగిరి చుట్టూ పరుచుకున్న ఇసుక తిన్నెల్లో కూర్చుని ఈ వేడుకను కనులారా చూసేందుకు భక్తులు భద్రాచలానికి బారులు దీరుతున్నారు. మరోవైపు వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గోదావరి నదిలో తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

ముందుగా దర్బారు సేవ..

పగల్ పత్తు ఉత్సవాల్లో భాగంగా నేడు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఉత్సవ మూర్తులకు విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేస్తారు. అంతకు ముందు సేవాకాలం, శ్రీ తిరుమంగై అళ్వార్ల పరమపదోత్సవాలు నిర్వహిస్తారు. ఆ తర్వాత మధ్యాహ్నం రాజభోగం, శాత్తుమురై, పూర్ణ శరణాగతితో పగల్ పత్తు ఉత్సవాలు ముగుస్తాయి. అనంతరం గర్భగుడిలో ప్రభుత్సోవం(దర్బార్ సేవ) చేపడతారు. సాయంత్రం వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తెప్పోత్సవానికి ఆలయం నుంచి గోదావరి తీరానికి తీసుకొస్తారు.

పల్లకీలో గోదావరికి..

పగల్‌పత్తు సేవలు ముగిసిన తర్వాత సాయంత్రం వేళ సీతారాముల వారు పల్లకీలో ఊరేగింపుగా గోదావరి తీరానికి బయలుదేరుతారు. రామయ్య బయలుదేరిన విషయం తెలిసిన వెంటనే పుణ్య జలాలతో హంసవాహనాన్ని సంప్రోక్షణ చేస్తారు. ఊరేగింపుగా పల్లకీలో వచ్చిన దేవేరులను హంస వాహనంలోని పచ్చిపూల మండపంలో తూర్పు ముఖంగా వేంచేపు చేస్తారు. ఈ సందర్భంగా వేద పండితులు చతుర్వేదాలు, నాళాయర దివ్యప్రబంధం, స్తోత్ర పాఠాలు, పంచసూక్తాలు పఠిస్తారు. అనంతరం చక్కెరపొంగలి నివేదన చేసి, మంగళ హారతి ఇస్తారు.

ఉత్తర దిశగా ప్రయాణం..

ఆగమ శాస్త్ర పూజాదికాలు పూర్తయిన తర్వాత సాయంత్రం సమయంలో రామయ్య కొలువుదీరి ఉన్న హంస వాహనం ఉత్తర ముఖంగా గోదావరిలో ప్రయాణం సాగిస్తుంది. ఉత్తర ముఖంగా కదిలిన వాహనం ఆ తర్వాత తూర్పు, అటు నుంచి దక్షిణం, చివరకు పడమర దిశకు చేరుకుని నదిలో పరిక్రమణం పూర్తి చేస్తారు. ఇలా ఐదు పరిక్రమణలు చేయించడం ఆనవాయితీగా వస్తోంది. సగటున ఒక్కో పరిక్రమణానికి 12 నిమిషాల చొప్పున సుమారు గంటపాటు తెప్పోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఈ వేడుక ముగిసిన తర్వాత ఆగమ శాస్త్ర పద్ధతులు అనుసరిస్తూ సీతారాములను తిరిగి ఆలయానికి తీసుకొస్తారు.

సాంకేతికత అందుబాటులోకి ఎప్పుడో..?

ప్రస్తుతం టెక్నాలజీ అభివృద్ధి చెందినా ఆలయ అధికారులు పాత పద్ధతిలోనే కరపత్రాలు ముద్రిస్తూ భక్తులకు ఏర్పాట్లపై అవగాహన కల్పిస్తున్నారు. ఆన్‌లైన్‌లో సేవా టికెట్లు, వసతి గృహాలను అందుబాటులోకి తెచ్చినట్టుగా దేవస్థానంలో జరిగే ప్రధాన ఉత్సవాల సమయంలో ప్రత్యేక మొబైల్ యాప్ అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఈ యాప్‌ను తయారు చేసి భద్రాచలంలో జరిగే ఉత్సవాలు, పూజలు, ఆన్‌లైన్ సౌకర్యాలతో పాటు ఉత్సవాల సమయంలో చేసే ఏర్పాట్లు, భక్తులకు కల్పించే వసతులు, రూట్‌మ్యాప్, ఆన్‌లైన్ స్ట్రీమింగ్ తదితర సమాచారం పొందుపరిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అంతే కాక భద్రాచల దివ్యక్షేత్రానికి అంతర్జాతీయంగా ప్రాచుర్యం లభించే అవకాశం ఉంటుంది. ఆ దిశగా దేవస్థానం అధికారులు ముందడుగు వేయాలని పలువురు సూచిస్తున్నారు.

భద్రగిరికి భారీగా భక్తులు..

సాధారణంగా పగల్‌పత్తు ఉత్సవాల సందర్భంగా తెప్పోత్సవం, ముక్కోటి ఏకాదశికి భారీగా భక్తులు వస్తుంటారు. అయితే ఈసారి మహాలక్ష్మి పథకం కూడా అమల్లో ఉండడంతో మహిళా భక్తులు భారీ సంఖ్యలో భద్రాద్రికి వస్తారనే అంచనాలు ఉన్నాయి. అయితే ప్రస్తుత ఏర్పాట్లన్నీ గతేడాది తరహాలోనే ఉన్నాయి. పెరుగనున్న మహిళల రద్దీకి తగ్గట్టుగా గోదావరి తీరం వెంట, ఆలయ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా దుస్తులు మార్చుకునే కేంద్రాలు, టాయిలెట్లు ఏర్పాట్లు చేయాలని పలువురు కోరుతున్నారు. అవసరమైతే ఆర్టీసీ ఆధ్వర్యంలో ఉన్న మొబైల్ టాయిలెట్లను భద్రాద్రికి రప్పించాలనే సూచనలు చేస్తున్నారు.

సమస్య తీరేనా..

సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు గోదావరిలో జరిగే తెప్పోత్సవాన్ని పోలీసుల ఆంక్షల వల్ల కరకట్ట, నదీ తీరం వెంబడి నుంచే వీక్షించాల్సిన పరిస్థితి ప్రతీసారి నెలకొంటోంది. దీంతో తెప్పోత్సవాన్ని దూరం నుంచే చూడాల్సి వస్తోంది. ప్రతి సంవత్సరం తీరంలో మొక్కుబడిగా రెండు ఎల్‌ఈడీలు ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల రద్దీకి తగ్గట్టుగా కరకట్టల వెంట, భక్తులు చూసేందుకు వీలుగా ఎల్‌ఈడీల సంఖ్యను పెంచాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ట్రాఫిక్ ఆంక్షలతో సరైన సమయంలో గోదావరి ప్రాంతానికి భక్తులు చేరుకోలేకపోతున్నారు. పట్టణంలోని ముఖ్యమైన కూడళ్లు, బస్టాండ్, ఇతర రద్దీ ప్రాంతాల్లో భారీ ఎల్‌ఈడీ తెరలను ఏర్పాటు చేయటం ద్వారా భక్తుల ఇక్కట్లు తీరడంతో పాటు భద్రాచలం పుణ్యక్షేత్రంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తుందని భక్తులు, స్థానికులు భావిస్తున్నారు. దేవస్థానం అధికారులు ఆ దిశగా ఆలోచించి పెద్ద ఎల్‌ఈడీ తెరలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



రామయ్య జల విహారానికి సిద్ధమైన హంస వాహనం

శ్రీ కృష్ణుడిగా రామయ్య

- ఘనంగా ఊంజల్‌సేవ
- నేడు తిరుమంగైళ్వార్ పరమపదోత్సవం



స్వామివారికి హారతి సమర్పిస్తున్న అర్చకుడు

భద్రాచలం: ముగ్ధమనోహర రూపం, చూడచక్కని ఆకారం, కిరీటంపై నెమలి పింఛం, చెంతనే సీతామహాదేవి, పక్కనే లక్ష్మణస్వామితో బంగారపు ఊయలలో ఊగుతూ శ్రీ కృష్ణావతారంలో భద్రాద్రి రామయ్య దర్శనమివ్వగా.. భక్తులు బ్రహ్మరథం పట్టారు. అధ్యయనోత్సవాల్లో భాగంగా రామాలయంలో జరుగుతున్న పగల్ పత్తు వేడుకల్లో స్వామివారిని గురువారం శ్రీ కృష్ణుడిగా అలంకరించారు. తొమ్మిది రోజులుగా స్వామివారిని రోజుకో రూపంలో అలంకరిస్తుండగా కృష్ణావతారంతో ఈ వేడుకలు ముగిశాయి.

వైభవంగా ఊంజల్ సేవ..

శ్రీ కృష్ణావతారుడైన రామయ్యకు వైభవంగా ఊంజల్ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్థాన విద్వాంసులు కీర్తనలు ఆలపిస్తుండగా అర్చకులు ఊయలలో ఊపుతూ వేదమంత్రాలు పఠించారు. అనంతరం హారతి సమర్పించారు. డోలోత్సవంలో స్వామి వారిని చూసి తరించిన భక్తులకు వెయ్యి అశ్వమేథయాగ ఫలాలకు దక్కినంత పుణ్యం సిద్ధిస్తుందని, సర్వపాపాలు తొలగి సుఖసంతోషాలు కలుగుతాయని వేద పండితులు వివరించారు. భక్తులు బెల్లం, వెన్న, అటుకులు తీసుకొచ్చి స్వామివారికి సమర్పించారు. అనంతరం పల్లకీ సేవగా మిథిలా స్టేడియంలోని వేదికపైకి తీసుకొచ్చి ఆశీనులను చేశారు. భక్తుల దర్శనానంతరం తిరువీధి సేవ నిర్వహించారు. అస్థాన మండపంలో స్వామి వారికి దర్బార్ సేవ, ఆరాధన, నివేదన సమర్పించిన తర్వాత పవళింపు సేవ చేశారు.

భక్తులు మెచ్చేలా ముక్కోటి ఏర్పాట్లు

కలెక్టర్ ప్రియాంక ఆల



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి ఆలయంలో నిర్వహిస్తున్న ముక్కోటి ఉత్సవాలకు భక్తులు మెచ్చేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. ఉత్తర ద్వార దర్శనం, తెప్పోత్సవ ఏర్పాట్లను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ రెండు వేడుకలకు వచ్చే భక్తులు, అతిథులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. భక్తులు గోదావరి లోపలికి వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. తెప్పోత్సవం నిర్వహించే హంస వాహనం ముందు, వెనుక రెండు పైలట్ పడవలు ఏర్పాటు చేయాలని, 40 మంది గజ ఈతగాళ్లు, 20 నాటు పడవలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పర్ణశాలలోనూ 20 మంది గజ ఈతగాళ్లు, 12 నాటు పడవలను సిద్ధంగా ఉంచుతామని చెప్పారు. ఉత్తర ద్వారదర్శనానికి వచ్చే భక్తులను కేటాయించిన సెక్టార్‌లోకి పంపాలని, సెక్టార్, లైజన్, ప్రొటోకాల్ విధులు కేటాయించిన అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. భక్తులు నామమాత్రపు చార్జీలు చెల్లించి కేటాయించిన స్థలాల్లో వాహనాలు పార్కింగ్ చేయాలని కోరారు. భక్తులకు సమాచారం తెలిపేందుకు కొత్తగూడెం బస్టాండ్, రైల్వేస్టేషన్‌తో పాటు భద్రాచలంలో పలు ప్రాంతాల్లో సమాచార కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. భక్తులు వేడుకలను వీక్షించేందుకు వీలుగా సెక్టార్లల్లో ఎల్‌ఈడీ టీవీలు ఏర్పాటు చేయాలన్నారు. శుక్ర, శనివారాల్లో మద్యం, మాంసాహారం విక్రయాలు నిలిపేయాలని ఎక్సైజ్, పౌర సరఫరాల శాఖ అధికారులకు సూచించారు. ఉత్సవాల్లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది వద్ద గుర్తింపు కార్డులుంటేనే ప్రవేశం కల్పిస్తామని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు డాక్టర్ రాంబాబు, మధుసూదన్‌రావు, ఏఎస్పీ పరితోష్ పంకజ్, ఆర్డీఓ మంగీలాల్ పాల్గొన్నారు.

కోవిడ్‌పై అప్రమత్తంగా ఉండాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): కోవిడ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం వైద్యాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. జిల్లాలో కోవిడ్ వ్యాప్తి జరుగకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని అన్నారు. గత మే నెల నుంచి ఇప్పటివరకు పాజిటివ్ కేసులు నమోదు కాలేదని చెప్పారు. ఎవరికైనా కోవిడ్ లక్షణాలు కనిపిస్తే వెంటనే పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో కోవిడ్ బెడ్లు అందుబాటులో ఉన్నాయని, మందులు, ఆక్సిజన్, వెంటిలేటర్లు, పీపీఈ కిట్లు, మాస్కులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ముక్కోటి ఉత్సవాలకు వచ్చే భక్తులు కోవిడ్ నిబంధనలు పాటించాలని, మాస్కులు ధరించాలని కోరారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ శిరీష తదితరులు పాల్గొన్నారు.

హ్యాపీ జర్నీ!

మహాలక్ష్మి పేరిట ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం వారిలో ఆనందాన్ని నింపింది. ఈనెల 14న జీరో టికెట్ జారీ ప్రారంభం కాగా, 20వ తేదీ వరకు ఖమ్మం రీజియన్‌లో పరిశీలిస్తే మొత్తం ప్రయాణికుల్లో 49.04 శాతం మంది మహిళలే ఉండడం విశేషం. వీరి ద్వారా వారం రోజుల్లో ఆర్టీసీకి రూ.2.93 కోట్ల ఆదాయం సమకూరనుంది. మహాలక్ష్మి పథకం ప్రారంభానికి ముందు రీజియన్‌లో ప్రయాణికులందరితో కలిపి రోజుకు రూ.1.05 కోట్ల ఆదాయం వచ్చేది. ఈ పథకంతో మహిళా ప్రయాణికులు పెరగగా... జీరో టికెట్ల ఆధారంగా మహిళల చార్జీలను ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించనుండడంతో సగటున రోజుకు రూ.1.40 కోట్ల ఆదాయం వస్తోంది. తద్వారా మహాలక్ష్మి ప్రారంభానికి ముందుతో పోలిస్తే ఆర్టీసీకి రికార్డు స్థాయిలో రోజుకు రూ.35 లక్షల మేర ఆదాయం పెరిగింది. – సాక్షిప్రతినిధి,ఖమ్మం

ఉచిత ప్రయాణంతో మహిళల్లో హర్షాతిరేకాలు

- వారం రోజుల్లో గణనీయంగా పెరిగిన ఓఆర్
- మహిళల తరఫున ప్రభుత్వం ద్వారా ఆర్టీసీకి రూ.2.93 కోట్ల ఆదాయం
- గతంతో పోలిస్తే రోజుకు రూ.లక్షల్లో పెరుగుదల
- జీరో టికెట్ల ఆధారంగా ఆర్టీసీకి చెల్లించనున్న ప్రభుత్వం

మహిళలే సగం

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇల్లెందు, మణుగూరు, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, భద్రాచలం, ఖమ్మం డిపోలు ఉన్నాయి. వీటి పరిధిలో 200 పల్లె వెలుగు, 173 ఎక్స్‌ప్రెస్ బస్సుల ద్వారా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం అందుబాటులోకివచ్చింది. ఈనెల 14 నుంచి 20 వరకు వారం రోజుల్లో ఆయా డిపోల పరిధిలో మొత్తంగా 11,34,619 మంది ప్రయాణించగా, ఆర్టీసీకి రూ.8,49,94,227 ఆదాయం వచ్చింది. ఇందులో రూ.2,93,27,867 మహిళా ప్రయాణికుల తరఫున ప్రభుత్వం నుంచి ఆర్టీసీకి చెల్లించనుంది. ఈ వారంలో ప్రయాణించిన వారిలో 34.51 శాతం పురుషులు ఉండగా, 49.04 శాతం మంది మహిళలు ఏడు డిపోల పరిధిలో ప్రయాణాలు చేశారు.

నాలుగు డిపోల్లో అంత కంటే ఎక్కువ

రీజియన్‌లోని ఏడు డిపోల్లో నాలుగు డిపోల్లోని బస్సుల్లో ఈ వారం సగానికి పైగా మహిళా ప్రయాణికులే ఉన్నారు. అత్యధికంగా మణుగూరు డిపో నుంచి 56.9 శాతం మంది, కొత్తగూడెం నుంచి 54.31 శాతం, ఖమ్మం నుంచి 52.51 శాతం, ఇల్లెందు నుంచి 52.58 శాతం మంది మహిళలు జీరో టికెట్‌పై ప్రయాణించారు. విద్యార్థినులు, మహిళా ఉద్యోగులతో రద్దీ బాగా పెరిగింది. ఇక మధిరలో 42.71 శాతం, సత్తుపల్లిలో 46.62, భద్రాచలంలో 38.02 శాతం మంది ప్రయాణికులు జీరో టికెట్‌తో ప్రయాణించినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

గుర్తింపు తప్పనిసరి..

మహిళలు జీరో టికెట్‌పై ప్రయాణించేందుకు అడ్రస్‌తో కూడిన గుర్తింపు కార్డును తప్పనిసరి చేశారు. ఆధార్, ఓటరు గుర్తింపు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర కార్డులను తెలంగాణలోని చిరునామాతో ఉంటేనే అనుమతిస్తామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర మహిళలకే ఈ పథకం వర్తించేలా జాగ్రత్తలు తీసుకుంటూ, కార్డు చూపించిన వారికే టికెట్ ఇస్తున్నారు. కొన్నాళ్లు జిరాక్స్, ఫోన్‌లో ఉన్న కాపీని అనుమతించినా.. ఇప్పుడు మాత్రం ఒరిజినల్ ఉండాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు.



ఇల్లెందు ఎక్స్‌ప్రెస్‌లో జీరో టికెట్లు జారీచేస్తున్న కండక్టర్

మా విద్యార్థినులకు కలిసొచ్చింది..



మహాలక్ష్మిపథకం మా స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థినులకు కలిసొచ్చింది. పథకం ప్రారంభమయ్యాక కిన్నెరసాని, వరంగల్, ఖమ్మంలో జరిగిన క్రీడాపోటీలకు విద్యార్థినులను తీసుకెళ్లాం. అంతకుముందు రూ.4 వేల వరకు చార్జీలకు అయ్యేది. ఇప్పుడు భారం తప్పింది. – జి.దివ్య, గర్ల్స్ స్పోర్ట్స్ స్కూల్, కాచనపల్లి, గుండాల మండలం

గుర్తింపు కార్డు తప్పనిసరి..



మహిళలు చిరునామాతో ఉన్న ఒరిజినల్ గుర్తింపు కార్డులు చూపించాలి. ఆధార్, ఓటరు, డ్రైవింగ్ లైసెన్స్‌ల్లో ఒకటి ఉండాలి. పాన్‌కార్డులపై అడ్రస్ లేనందున అనుమతించడం లేదు. తెలంగాణ మహిళలే లబ్ధి పొందేలా అందరూ మా కండక్టర్లకు సహకరించాలి. – సీహెచ్.వెంకన్న, ఆర్టీసీ ఆర్‌ఎం, ఖమ్మం

ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు జీరో టికెట్‌తో ప్రయాణించిన మహిళలు, ప్రభుత్వం నుంచి ఆర్టీసీకి అందే ఆదాయం

డిపో	ప్రయాణికులు	ఆదాయం
ఖమ్మం	1,49,630	రూ.76,94,029
సత్తుపల్లి	1,05,042	రూ.43,09,530
మణుగూరు	89,287	రూ.44,64,890
కొత్తగూడెం	73,058	రూ.36,24,985
మధిర	60,873	రూ.42,50,443
భద్రాచలం	56,386	రూ.39,74,740
ఇల్లెందు	22,121	రూ.10,09,250
మొత్తం	5,56,397	రూ.2,93,27,867

రాఖీపౌర్ణమిని తలపించేలా..

ఈ ఏడాది రాఖీ పౌర్ణమి రోజున ఆర్టీసీ ఖజానా గలగలలాడింది. రాఖీ కట్టేందుకు వెళ్లి, వచ్చిన 90 శాతం ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించడంతో ఆ రోజు రూ.1.40 కోట్ల ఆదాయం వచ్చింది. ఇప్పుడు మహాలక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వం మహిళల తరఫున చెల్లించే నగదుతో పాటు పురుషుల టికెట్ల ద్వారా రోజుకు సగటున రూ.1.40 కోట్లు వస్తుండడం ఆర్టీసీ అధికారుల్లో ఆనందాన్ని నింపుతోంది. రోజువారీగా రీజియన్‌లోని అన్ని డిపోల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య, రావాల్సిన ఆదాయం వివరాల నివేదికను ఎండీకి అధికారులు పంపిస్తున్నారు.

రిజిస్ట్రేషన్లలో తప్పటడుగులు

- ఇష్టారాజ్యంగా చేస్తున్నారని విమర్శలు
- ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్లు ఉన్నచోట్ల అక్రమాల పరంపర
- ఇటీవల కాలంలో పలువురిపై సస్పెన్షన్ వేటు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వానికి అత్యధిక ఆదాయాన్ని సమకూర్చే శాఖల్లో మొదటగా ఉండే స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ గాడితప్పుతోందనే విమర్శలు వస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కార్యాలయాల్లో జరుగుతున్న దందా చర్చనీయాంశంగా మారుతోంది. లింక్ డాక్యుమెంట్లు లేకున్నా, అనుమతులు లేని స్థలాలను రిజిస్ట్రేషన్ చేయొద్దనే నిబంధనలు ఉన్నా పట్టించుకోకుండా పలువురు అధికారులు పని కానిచ్చేస్తున్నారు. స్లాట్ బుక్ చేసుకుని రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వారి దస్తావేజులను కనీసం పరిశీలించకుండానే సంతకాలు పెట్టేస్తున్నారు. ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్లు ఉన్న చోట్ల అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి. వీరికి తోడు ఇటీవల పలుచోట్ల విధుల్లో చేరిన రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు సైతం అసైన్డ్ భూములు రిజిస్ట్రేషన్ చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత రెండేళ్ల కాలంలో అక్రమ రిజిస్ట్రేషన్ల సంఖ్య వందల్లో జరిగినట్లు అధికారుల విచారణలో తేలిందని సమాచారం.

ఇన్‌చార్జ్‌లతోనే..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో చిట్ రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిల్లో ఖమ్మం, ఖమ్మంరూరల్, కూసుమంచి, మధిర, కల్లూరు, సత్తుపల్లి, ఇల్లెందులో రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు.. వైరా, కొత్తగూడెం, భద్రాచలం, బూర్గంపాడు కార్యాలయాల్లో ఇన్‌చార్జిలు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇన్‌చార్జిలుగా ఉన్న వారంతా సీనియర్ అసిస్టెంట్లే కాగా, అక్రమాలకు పాల్పడుతున్నారనే చర్చ జరుగుతోంది. కూసుమంచి, వైరా, కొత్తగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇటీవల ఈ ఆరోపణలు అధికమయ్యాయి. గతంలో ఖమ్మంరూరల్, మధిరలో సైతం ప్రభుత్వ స్థలాలను ప్రైవేట్ వ్యక్తులకు రిజిస్ట్రేషన్లు చేసిన సమయాన ఇన్‌చార్జ్‌లే విధుల్లో ఉండడం గమనార్హం.

నిబంధనలకు విరుద్ధంగా..

ఇటీవల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నతాధికారులకు అందినట్లు సమాచారం. దీంతో విచారణ చేపట్టిన అధికారులు బాధ్యులపై చర్యలకు ఉపక్రమిస్తున్నారు. రెండు నెలల కాలంలో ఒక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేయగా.. ఇటీవల మరో కార్యాలయంలో ఉద్యోగులను బదిలీ చేసి కొత్త వారికి ఇన్‌చార్జి అప్పగించారు. ఇటీవల రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు ఒకరిద్దరు అనుమతి లేని భూములకు రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు సమాచారం. ఖమ్మం నగర శివార్లలో రూ.కోట్ల విలువైన అసైన్డ్ భూములకు రిజిస్ట్రేషన్ పూర్తిచేశారని తెలిసింది. కొత్తగూడెంలో రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్‌పై ఆరోపణలు రావడంతో ఆయన సెలవులో వెళ్లగా, విచారణ జరుపుతూనే ఇంకో ఉద్యోగికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీనిపై ఖమ్మం రిజిస్ట్రార్ చిట్టిమళ్ల అశోక్ కుమార్‌ను వివరణ కోరగా కొత్తగూడెం, వైరాలో నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు జరిగాయనే ఆరోపణలు వచ్చాయని, వాటిపై విచారణ చేస్తున్నామని చెప్పారు. విచారణలో అక్రమాలు నిజమేనని తేలితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

సెల్‌టవర్ పేల్చివేతకు ప్రయత్నం

దుమ్ముగూడెం : మండలంలోని పైడిగూడెంలో ఉన్న ఓ ప్రైవేట్ సెల్‌టవర్‌ను పేల్చివేసేందుకు మావోయిస్టులు గురువారం రాత్రి ప్రయత్నించారు. శుక్రవారం భారత్ బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యాన మావోలు ఈ ఘటనకు పాల్పడినట్లు తెలుస్తోంది. అయితే బంద్ సందర్భంగా ముందుగానే పోలీసులు సరిహద్దు గ్రామాల వెంట ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. సెల్‌టవర్ వద్దకు చేరుకున్న 10 నుంచి 15 మంది మావోయిస్టులు బీరు బాటిళ్లలో పెట్రోల్ నింపి సెల్‌టవర్ పైకి విసిరారు. దీంతో పెద్ద శబ్దం రావడంతో సమీపంలో ఉన్న పోలీసులు చేరుకుంటుండగానే మావోయిస్టులు పారిపోయారు. ఈ సందర్భంగా బంద్‌ను విజయవంతం చేయాలంటూ హిందీలో ముద్రించిన వాల్‌పోస్టర్లను అక్కడ వదిలారు. కాగా, పెట్రోల్ సీసాలు పడినప్పుడు వేడిగా ఉన్న కొన్ని పరికరాలు పాక్షికంగా దగ్ధమయ్యాయి.

క్లుప్తంగా

ఆ సమయంలో పాతబస్టాండ్ మీదుగా..

ఖమ్మం మామిళ్లగూడెం: రాత్రి సమయాన ప్రయాణికుల ఇబ్బందులపై వచ్చిన విజ్ఞప్తిని పరిగణనలో తీసుకుని రాత్రి 9 నుంచి తెల్ల వారుజామున 4గంటల వరకు ఖమ్మం నూతన బస్టాండ్ నుంచి మొదలయ్యే ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులను వయా పాత బస్టాండ్ మీదుగా నడిపిస్తున్నామని ఆర్‌ఎం సీహెచ్.వెంకన్న ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నుంచి ఖమ్మం వచ్చే బస్సులు కాల్వొడ్డు, మయూరిసెంటర్, ఖమ్మం డిపోరోడ్, రాపర్తినగర్ మీదుగా కొత్త బస్టాండ్‌కు చేరుకుంటాయని పేర్కొన్నారు. హైదరాబాద్ వైపు వెళ్లే బస్సులు ఇల్లెందు క్రాస్‌రోడ్, జెడ్పీ సెంటర్, మయూరిసెంటర్, ఖమ్మం డిపో రోడ్, రాపర్తి నగర్ మీదుగా కొత్త బస్టాండ్‌కు చేరుకుంటాయని తెలిపారు. అయితే, సూపర్ లగ్జరీ, రాజధాని బస్సుల నిర్వహణలో మాత్రం ఎలాంటి మార్పు లేదని వెల్లడించారు.

పాఠశాలల్లో బోధనతీరు పరిశీలన



బోధనను పర్యవేక్షిస్తున్న ఎఫ్‌ఎల్‌ఎన్ రాష్ట్ర కమిటీ సభ్యులు

దమ్మపేట: ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్‌ఎల్‌ఎన్) పద్ధతిలో ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న బోధనను ఎఫ్‌ఎల్‌ఎన్ రాష్ట్ర కమిటీ సభ్యులు కార్తీక్, మురళీకృష్ణ గురువారం పరిశీలించారు. మండల పరిధిలోని జగ్గారం, బూరుగుంపు, దమ్మపేట అర్బన్‌కాలనీల్లో ఉన్న ప్రాథమిక పాఠశాలలను ఎఫ్‌ఎల్‌ఎన్ రాష్ట్ర కమిటీ సభ్యులు సందర్శించారు. ఎఫ్‌ఎల్‌ఎన్ లక్ష్యాలను సాధించి, ప్రతి విద్యార్థిలో కనిష్ట సామర్థ్యాలను వెలికితీసేలా బోధన కొనసాగాలని ఉపాధ్యాయులకు సూచించారు. బోధన సమయంలో ఉపాధ్యాయులు హ్యాండ్ బుక్ తమతో ఉంచుకుని, విద్యార్థులచే ఎఫ్‌ఎల్‌ఎన్ వర్క్‌బుక్స్ సాధన చేయించాలని సూచించారు. జగ్గారం ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం పుష్పకుమారి బోధనను పర్యవేక్షించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఎల్‌ఎన్ మండల అధికారి జగపతి, ఎంఈఓ కీసర లక్ష్మి, పలు పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పవర్ ప్లాంట్‌ను సందర్శించిన అధికారులు

దమ్మపేట: మండల పరిధిలోని అప్పారావుపేట ఫ్యాక్టరీలో ఉన్న పవర్ ప్లాంట్‌ను రాష్ట్ర రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు సుధాకర్, కిరణ్‌కుమార్ గురువారం సందర్శించి, పరిశీలించారు. అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో గెలల క్రషింగ్ అనంతరం లభించే బయోమాస్‌ను ఉపయోగించి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. తక్కువ ఖర్చుతోనే ఫ్యాక్టరీకి కావలసిన విద్యుత్‌ను తయారు చేసుకుంటున్నారు. ఈ ప్లాంట్‌ను అధికారులు పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. ఆయిల్‌ఫెడ్ ప్రాజెక్ట్స్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, ఫ్యాక్టరీ మేనేజర్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

'యూడైస్' రాష్ట్ర పరిశీలకుల సందర్శన

అశ్వారావుపేటరూరల్: యూడైస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇనఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్) రాష్ట్ర పరిశీలకులు మండలంలోని నారాయణపురం, నందమూరినగర్ ప్రాథమిక పాఠశాలలను గురువారం సందర్శించారు. యూడైస్ నివేదికలో హెచ్‌ఎంలు అందించిన వివరాలు, క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులను తనిఖీ చేశారు. అలాగే తొలిమెట్టు నిర్వహణ తీరు, విద్యార్థుల సామర్థ్యాలు, టీఎల్‌ఎం వినియోగం, బోధన తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశీలకులు కార్తీక్, మురళి, తొలిమెట్టు నోడల్ అధికారి ప్రసాదరావు మాట్లాడుతూ.. అశ్వారావుపేట మండలంలో 2, దమ్మపేట మండలంలో నాలుగు పాఠశాలల్లో పరిశీలన చేశామని చెప్పారు. కొన్ని పాఠశాలల్లో మార్పులు చేయాలని సూచించామని, నందమూరినగర్ పాఠశాల ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌రావు పనితీరు ప్రశంసనీయంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హరిత, సీఆర్పీ ప్రభాకరాచార్యులు పాల్గొన్నారు.

ఇసుక నిల్వలపై ఆరా..



ఇసుక నిల్వలను పరిశీలిస్తున్న మైనింగ్ ఏడీ జైసింగ్

మణుగూరు రూరల్ : రామానుజవరం గుట్టపై అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుక నిల్వలను మైనింగ్ ఏడీ జైసింగ్ గురువారం సందర్శించి పరిశీలించారు. వివరాలను అడిగి తెలుసుకుని పంచనామా నిర్వహించారు. గుట్టమల్లారం సమీపంలోని బ్రహ్మంగారి గుట్ట ప్రాంతంలో కూడా గ్రావెల్ తరలింపును రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,454

ముక్కోటి ఏర్పాట్లు పూర్తి

- ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసిన ఆర్టీసీ
- ఈసారి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యే అవకాశం



తెప్పోత్సవం జరిగే ప్రదేశంలో ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్లు



సమాచార కేంద్రం

భద్రాచలంటౌన్: భద్రాచలంలో శ్రీసీతారామ చంద్ర స్వామివారి దేవస్థానంలో నిర్వహించే ముక్కోటి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం తెప్పోత్సవం, శనివారం ఉత్తర ద్వార దర్శనం నిర్వహించనుండగా, భక్తులు అధిక సంఖ్యలో హాజరు కానున్నారు. వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తున్నారు. తెప్పోత్సవం జరిగే ప్రదేశంలో భారీగా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. పట్టణంలో రెండు రోజులు ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతోపాటు ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలు కేటాయించారు. సమాచార కేంద్రాలు, వైద్య శిబిరాలను సిద్ధం చేశారు. పారిశుద్ధ్య పనులను ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇక భద్రాచలం నుంచి పర్ణశాలకు గురువారం నుంచే ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. గతేడాది కంటే ఈ సారి భక్తుల తాకిడి ఎక్కువగా ఉండనున్నట్లు ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఆర్టీసీలో మహిళలకు ప్రయాణం ఉచితం కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి మహిళా భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు. ఇందుకు అనుగుణంగా పలు రూట్లల్లో బస్సుల సంఖ్యను పెంచుతున్నట్లు తెలిపారు.

భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు

ప్రసాదం కౌంటర్లు : ఆలయం తూర్పు మెట్ల వద్ద 6 కౌంటర్లతో పాటు దేవస్థానం అధికారులు నిర్దేశించిన ప్రదేశాల్లో ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేశారు.
పార్కింగ్: కల్యాణ మండప స్టేడియం వద్ద
ఉచిత వసతి సౌకర్యం: విస్తా కాంప్లెక్స్ పక్కన

సమాచార కేంద్రాలు

1. ఆంజనేయ స్వామి విగ్రహం
2. ఆర్టీసీ బస్టాండ్
3. తానీషా కల్యాణ మండపం
4. ఇందిరా గాంధీ విగ్రహం వద్ద

ప్రథమ చికిత్స కేంద్రాలు

1. ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో
2. ఆర్టీసీ బస్టాండ్
3. విస్తా కాంప్లెక్స్
4. గోదావరి ఘాట్
5. కల్యాణ మండపం
6. ఆలయ ప్రాంగణంలో
7. తానీషా కల్యాణ మండపం
8. సాధువుల మండపం

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఖమ్మం మామిళ్లగూడెం: ముక్కోటి ఏకాదశి సందర్భంగా భద్రాచలం పుణ్యక్షేత్రంలో జరిగే ఉత్తర ద్వార దర్శనానికి వెళ్లే భక్తుల కోసం ఖమ్మం రీజియన్‌లోని అన్ని డిపోల నుంచి శనివారం ప్రత్యేక బస్సులు నడిపిస్తామని ఆర్‌ఎం సీహెచ్.వెంకన్న తెలిపారు. కొత్తగూడెం డిపో నుంచి ఆరు, ఖమ్మం, మణుగూరు డిపోల నుంచి ఐదు చొప్పున, సత్తుపల్లి, మధిర నుంచి నాలుగు చొప్పున, ఇల్లెందు డిపో నుంచి రెండు చొప్పున అదనపు బస్సులు ఏర్పాటుచేసి భద్రాచలానికి 48 ట్రిప్పులు నడిపించనున్నామని పేర్కొన్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు సర్వీసులు కూడా ఏర్పాటు చేస్తామని ఆర్‌ఎం తెలిపారు.

ఆన్‌లైన్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

భద్రాచలంటౌన్: శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో నిర్వహించే ముక్కోటి ఉత్సవాలకు వచ్చే భక్తులు ఆన్‌లైన్ ద్వారా దర్శనం టికెట్లు, రూములను బుక్ చేసుకునే అవకాశం ఉందని భద్రాచలం ఆర్డీఓ మంగీలాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు దేవస్థానం వెబ్‌సైట్ ద్వారా ఉత్తర ద్వార దర్శనం, వసతి గదులను బుకింగ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

భక్తుల అవగాహనకు ఫ్లెక్సీలు ఏర్పాటు

భద్రాచలంఅర్బన్: శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శుక్ర, శనివారాల్లో జరిగే వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం సమాచారం ఇచ్చేలా అధికారులు పోస్టర్లు ఏర్పాటు చేశారు. పార్కింగ్ స్థలానికి దారి, దేవస్థానం ఏర్పాటు చేసిన లడ్డూ కౌంటర్, సెక్టార్ల విభజనపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పట్టణవ్యాప్తంగా ఫ్లెక్సీలను ప్రదర్శిస్తున్నారు.



బ్రిడ్జి సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఉత్సాహంగా యువజనోత్సవాలు

ఆటపాటలతో అలరించిన విద్యార్థులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఐఈఓ సులోచనారాణి, పక్కన సీతారాం తదితరులు



జానపద నృత్యం చేస్తున్న విద్యార్థులు

కొత్తగూడెంటౌన్: జిల్లాస్థాయి యువజనోత్సవాలు ఉత్సాహంగా సాగాయి. యువతీ యువకులు జానపద నృత్యాలు, వక్తృత్వ, వ్యాసరచన, పెయింటింగ్, ఫొటోగ్రఫీ, చిత్రలేఖనం తదితర పోటీల్లో సత్తా చూపారు. వేడుకలతో కొత్తగూడెం క్లబ్ సందడిగా మారింది. జిల్లావ్యాప్తంగా సుమారు 450 మందికి పైగా కళాకారులు వేడుకలకు తరలివచ్చారు. యువజన క్రీడలశాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఈ ఉత్సవాలను పరిశ్రమల శాఖ జీఎం టి.సీతారాం, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారిణి సులోచనారాణి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. యువత విద్యతోపాటు కళారంగంలో రాణించాలని సూచించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందించారు. జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి (డీవైఎస్‌ఓ) పి.పరంధామరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.రమేష్ పాల్గొన్నారు. కాగా ప్రథమ స్థానం సాధించిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు డీవైఎస్‌ఓ తెలిపారు.

విజేతలు వీరే..

జానపద నృత్యం గ్రూప్‌లో :
ప్రథమ బహుమతి : భవ్య టీం కేఎల్‌ఆర్ ఫార్మసీ కాలేజీ
ద్వితీయ బహుమతి : కావ్య టీం టీఎస్‌ఆర్‌జేసీ, బూర్గంపాడు

జానపద నృత్యం సోలో :
ప్రథమ బహుమతి : వెన్నెల టీం పాల్వంచ
ద్వితీయ బహుమతి : దుర్గా, టీఎస్‌ఆర్‌జేసీ, బూర్గంపాడు.

జానపద గేయాలు గ్రూప్ :
ప్రథమ బహుమతి : స్పందన టీం టీఎస్‌డబ్ల్యూ ఆర్‌ఎస్‌జేసీ, భద్రాచలం
ద్వితీయ బహుమతి : మోనాలిసా టీం జీజేసీ,కొత్తగూడెం

జానపద గేయాలు సోలో :
ప్రథమ బహుమతి : తరుణ్‌తేజ్ టీం కేఎల్‌ఆర్ కళాశాల, పాల్వంచ
ద్వితీయ బహుమతి : ఉమాదేవి, అనుబోస్ కళాశాల, పాల్వంచ

వ్యాసరచనలో:
ప్రథమ బహుమతి: వి.సరస్వతి అనుబోస్, కళాశాల, పాల్వంచ
ద్వితీయ బహుమతి : ఎల్.నాగయగ్నేశ్వర్, జీపీటీ, కొత్తగూడెం

వక్తృత్వంలో :
ప్రథమ బహుమతి: ఎస్.వంశీ, కేఎల్‌ఆర్ కళాశాల, పాల్వంచ
ద్వితీయ బహుమతి : ఏ.సుప్రియ అనుబోస్ కళాశాల, పాల్వంచ

పెయింటింగ్‌లో :
ప్రథమ బహుమతి: కె.కుసుమ, సింగరేణి ఉమెన్స్ కళాశాల, కొత్తగూడెం
ద్వితీయ బహుమతి: కె.సుస్మిత, టీఎస్‌ఈఎంఆర్‌ఎస్, పాల్వంచ

ఫొటోగ్రఫీ:
ప్రథమ బహుమతి : సీహెచ్ తరంగిణి, అనుబోస్ కళాశాల, పాల్వంచ
ద్వితీయ బహుమతి : ఏ.విక్రంతేజ, జీజేసీ– కొత్తగూడెం

ముక్కోటికి పటిష్ట బందోబస్తు

ఎస్పీ వినీత్ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ వినీత్

కొత్తగూడెంటౌన్: భద్రాచలంలో జరిగే తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. తన కార్యాలయంలో గురువారం ఆయన పోలీసు అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భద్రాచలం వచ్చే భక్తులు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే సమస్త సమాచారం లభ్యమవుతుందని చెప్పారు. క్యూఆర్ కోడ్‌తో కూడిన స్కానర్‌ను, https//mukkoti.netlify.app లింక్‌ను ఉపయోగించాలని కోరారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు.

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి బాలికల క్రికెట్ టోర్నీ



జిల్లా జట్టుతో డీఈఓ వెంకటేశ్వరాచారి, పీఈటీలు

అశ్వాపురం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఈనెల 23నుండి 26 వరకు అండర్–17 బాలికల రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నారు. గౌతమీనగర్ కాలనీలోని టర్ఫ్ వికెట్‌పై పోటీలు జరగనుండగా, ఏర్పాట్లను ఎస్‌జీఎఫ్ చైర్మన్, జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరాచారి పరిశీలించారు. టోర్నీకి హాజరయ్యే క్రీడాకారులు, పోటీల నిర్వహణకు ఎలాంటి ఇబ్బంది ఎదురుకాకుండా ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఉమ్మడి పది జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు హాజరుకానుండగా, గౌతమీనగర్ కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన వసతి కల్పించారు. కాగా, పోటీలకు సిద్ధమవుతున్న జిల్లా జట్టు క్రీడాకారులను కలిసిన డీఈఓ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వీరస్వామి, జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ప్రధాన కార్యదర్శి స్టెల్లా జ్ఞానవతి, గౌతమీనగర్ కాలనీ స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ కందుల శ్రీనివాసరావు, పీఈటీలు అనిల్‌కుమార్, వీరన్న, నరేష్ పాల్గొన్నారు.

స్వీయరక్షణపై బాలికలకు అవగాహన



టేకులపల్లి ఏకలవ్య పాఠశాలలో శిక్షణ పొందుతున్న బాలికలు

టేకులపల్లి: సమాజంలో ఎదురయ్యే అడ్డంకులు, ఇబ్బందులు అధిగమించేలా బాలికలకు స్వీయరక్షణపై శిక్షణ ఇస్తున్నారు. రాష్ట్రంలోని 23 ఏకలవ్య పాఠశాలల బాలబాలికలకు ఈనెల 15 నుంచి 24వరకు వాయిస్ ఫర్ గర్ల్స్ ఆధ్వర్యాన ఈ శిక్షణ ఇస్తుండగా, 17 పాఠశాలల్లోని 9వ తరగతి చదువుతున్న 354 మంది బాలికలను టేకులపల్లిలోని ఏకలవ్య పాఠశాలకు కేటాయించారు. స్వీయరక్షణపై శిక్షణ ఇవ్వడమేకాక నాయకత్వ లక్షణాలు పెంచుకునేలా ఇక్కడ అవగాహన కల్పిస్తున్నారు. ప్రిన్సిపాల్ కె.భద్రయ్య, వైస్ ప్రిన్సిపాల్ జ్యోతి, క్యాంపు ఇన్‌చార్జ్ అంకిత తదితరులు పాల్గొన్నారు.

బోధనలో నిర్లక్ష్యం చేయొద్దు

డీఈఓ వెంకటేశ్వరా చారి

మణుగూరురూరల్: బోధనలో నిర్లక్ష్యం చేస్తే ఊరుకునేది లేదని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరా చారి తెలిపారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను గురువారం ఆయన పరిశీలించారు. మధ్యాహ్న భోజన నిర్వహణ, ఎఫ్ఆర్‌సీ హాజరులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీస్ ఇవ్వాలని ఎంఈఓను ఆదేశించారు. సమితి సింగారం ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యార్థులకు భోజనం అందించకపోవడం, పీటీఎం సమావేశాలు నిర్వహించకుండానే మినట్స్‌లో రాయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పాఠశాల ఉపాధ్యాయులకు కూడా షోకాజ్ నోటీస్ ఇవ్వాలని సూచించారు. శ్రీసాయి నగర్‌లోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. మణుగూరు, రామానుజవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఎఫ్ఆర్‌సీ హాజరును తనిఖీ చేశారు. ఆయన వెంట విద్యా శాఖ జిల్లా సెక్టోరియల్ అధికారులు ఎస్‌కే సైదులు, ఎస్.సతీష్‌కుమార్, ఎంఈఓ వీరస్వామి తదితరులు ఉన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ఉమ్మడి ఖమ్మం జిల్లా గిరిజన గురుకుల విద్యాలయాల్లో ఎస్టీ, ఎస్సీ, బీసీ, జనరల్ విద్యార్థులకు ఐదో తరగతిలో ప్రవేశాలు కల్పించనున్నట్లు పీఓ ప్రతీక్ జైన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వచ్చేనెల 6వ తేదీలోగా ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఫిబ్రవరి 11న పరీక్ష నిర్వమించి అర్హులను ఎంపిక చేస్తామని, పూర్తి వివరాలకు గిరిజన సంక్షేమ శాఖ విద్యాలయాల్లో సంప్రదించాలని పీఓ తెలిపారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

ఐసీడీఎస్ పీడీ వేల్పుల విజేత



ఎల్ఈడీ టీవీలు పంపిణీ చేస్తున్న విజేత

చంద్రుగొండ : అంగన్‌వాడీ టీచర్లు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఐసీడీఎస్ పీడీ వేల్పుల విజేత సూచించారు. చంద్రుగొండ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సాక్ష్యం పథకం కింద మంజూరైన ఎల్ఈడీ టీవీలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు విద్య సులువుగా అర్థమయ్యేందుకు సాంకేతికతను ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఈ పథకాన్ని భద్రాద్రి జిల్లాతోపాటు ఆసిఫాబాద్, భూపాలపల్లి జిల్లాల్లో ప్రభుత్వం ప్రయోగాత్మకంగా అమలు చేస్తోందని తెలిపారు. జిల్లాలోని 2,060 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, 350 కేంద్రాలను సాక్ష్యం పథకానికి ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఎంపీపీ బాణోత్ పార్వతి, ఐసీడీఎస్ సీడీపీఓ నిర్మలాజ్యోతి, సూపర్‌వైజర్లు సుజాత, శకుంతల, రాణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేపు స్విమ్మింగ్ ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: కాకతీయ యూనివర్సిటీ పరిధి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల స్థాయి పురుషుల, మహిళల స్విమ్మింగ్ జట్ల ఎంపిక పోటీలు ఈనెల 23న శనివారం నిర్వహిస్తున్నట్లు ఖమ్మం జోన్ కార్యదర్శి డాక్టర్. బి.వెంకన్న తెలిపారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలోని స్విమ్మింగ్ పూల్‌లో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు అర్హత ఫారంతో పాటు ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ మెమోలతో హాజరుకావాలని, పూర్తి వివరాలకు 94412 36384 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

28, 29 తేదీల్లో ఖమ్మం జోన్ క్రికెట్ ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి(ఖమ్మం జోన్) డిగ్రీ, పీజీ కళాశాలల క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు ఈనె 28, 29వ తేదీల్లో నిర్వహించనున్నట్లు క్రీడల కార్యదర్శి డాక్టర్.బి.వెంకన్న తెలిపారు. ఖమ్మంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో జరిగే పోటీలకు ప్రతీ డిగ్రీ కళాశాల నుంచి ఐదుగురు క్రికెటర్ల చొప్పున సొంత క్రికెట్ కిట్‌తో హాజరుకావాలని సూచించారు. డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులైతే మెమోలు, ప్రథమ సంవత్సరం వారైతే 17 ఏళ్ల వయసు కలిగి ఎస్సెస్సీ, ఇంటర్ మెమోలతో కళాశాల గుర్తింపు కార్డుతో రావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 94412 36384 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

బస్సును దగ్ధం చేసిన మావోయిస్టులు

చర్ల: బిహార్, జార్ఖండ్ రాష్ట్రాల్లో విప్లవోద్యమంపై ప్రభుత్వ బలగాలు కొనసాగిస్తున్న అణచివేతను నిరసిస్తూ ఈ నెల 22న భారత్ బంద్‌కు పిలుపునిచ్చిన మావోయిస్టులు వరుస విధ్వంసాలకు పాల్పడుతున్నారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలలోని సుకుమా, దంతెవాడ, గడ్చిరోలి జిల్లాల్లో బస్సులు, లారీలు, కార్లు, రోడ్డు పనులకు వినియోగిస్తున్న ట్రాక్టర్లు, జేసీబీలను దగ్ధం చేశారు. తాజాగా బీజాపూర్ జిల్లాలో గురువారం తెల్లవారుజామున మద్దేడు సమీపంలో ఉన్న సోమన్‌పల్లిలో సెల్ టవర్ కంట్రోల్ రూంకు నిప్పటించారు. ఇదే జిల్లాలోని ఆవుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న దుర్గాయిగూడ సమీపంలో ఆవుపల్లి నుంచి రాయ్‌పూర్‌కు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన ఓ బస్సును నిలిపివేసి, ప్రయాణికులను కిందకు దించారు. అనంతరం డీజిల్ ట్యాంకును పగులగొట్టి నిప్పంటించడంతో బస్సు పూర్తిగా దగ్ధమైంది.

వ్యక్తిపై కేసు నమోదు

కొత్తగూడెంఅర్బన్: ట్రిపుల్ తలాక్ విషయంలో ఓ వ్యక్తిపై కొత్తగూడెం త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో బుధవారం రాత్రి కేసు నమోదయింది. త్రీటౌన్ సీఐ మురళి కథనం ప్రకారం.. మేదరబస్తీకి చెందిన మహిళకు, పాల్వంచ బొల్లోరిగూడేనికి చెందిన షేక్ జమీల్‌కు 2013లో వివాహం జరిగింది. ఇరువురి మధ్య కుటుంబ కలహాల నేపథ్యంలో గత జూలైలో ఇద్దరూ సాక్షుల సమక్షంలో ట్రిపుల్ తలాక్ చెప్పుకుని విడాకులు తీసుకున్నట్లు భర్త జమీల్ భార్యకు లాయర్ నోటీసును పంపించాడు. కాగా తనకు న్యాయం చేయాలని భార్య జాతీయ మైనారిటీ కమిషన్‌ను ఆశ్రయించింది. కమిషన్ విచారణ జరిపి జమీల్‌పై కేసు నమోదు చేయాలని ఆదేశించగా.. పోలీసులు ముస్లిం ఉమెన్ ప్రొటెక్టియాక్ట్–2019 ప్రకారం కేసు నమోదు చేశారు.

రుణం ఇప్పిస్తానని కానిస్టేబుల్ మోసం

కేసు నమోదు చేసిన పోలీసులు

పాల్వంచ: రుణం ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేసిన ఎస్పీఎఫ్ కానిస్టేబుల్‌పై గురువారం పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కేటీపీఎస్‌లో పనిచేసే ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ నూనావత్ రాజేందర్ పీఎంఈజీపీ పథకంలో రూ.2 కోట్ల రుణం ఇప్పిస్తానని కేటీపీఎస్ ఇంటర్మీడియట్ కాలనీకి చెందిన జేపీఏ భూక్యా వెంకటేశ్వరరావును నమ్మించాడు. ఇందుకోసం కమీషన్ రూ.5 లక్షలకు ఒప్పందం చేసుకోగా, వెంకటేశ్వరరావు రూ.1.80 లక్షలు చెల్లించాడు. రెండేళ్లు గడుస్తున్నా రుణం ఇప్పించకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాఘవయ్య తెలిపారు.